క్లుప్తంగా

ప్రజలను చైతన్యవంతం చేయాలి

సీపీఐ నాయకుడు అజయ్‌కుమార్



లక్ష్మీపురం: ప్రజలను చైతన్యవంతం చేయడంలో కళారూపాల పాత్ర కీలకమని సీపీఐ నాయకుడు జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్ అధ్యక్షతన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పాటలు, కళారూపాల శిక్షణ శిబిరం శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళారూపాలు, అభ్యుదయ గేయాలు ప్రజా చైతన్యం కోసం, అసాంఘిక, మతోన్మాద, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా విరోచితంగా ప్రజలను చైతన్యపరిచేందుకు కృషిచేసిన ప్రజానాట్యమండలి సుదీర్ఘంగా తన ఆటపాటలతోటి ప్రజలు చైతన్యపరిచిందని అన్నారు. కార్యక్రమంలో ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఆఫీస్ బేరర్స్ రామకృష్ణ, ఆరేటి రామారావు, పిచ్చయ్య, బొల్లిమంత కృష్ణ, నసిర్, నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

విదేశీ వైద్య విద్యార్థులకు ఐఎంఏ బాసట



గుంటూరు మెడికల్: కొన్ని నెలలుగా విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యకు కారణాలను అధ్యయనం చేసినట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం మీడియాతో ఆయన వివరాలు వెల్లడించారు. గత ఐదేళ్లుగా కోవిడ్-19, రష్యా - ఉక్రయిన్ యుద్ధం వంటి ప్రపంచంలో నెలకొన్న అసాధరణ పరిస్థితులు వైద్య విద్యార్థులను గందరగోళ పరిస్థితికి తీసుకెళ్లాయన్నారు. పది నెలలుగా ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి పూర్తిగా ఏర్పడకపోవడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ఇప్పుడు వైద్య మండలి ఒక స్థాయిలోకి ఏర్పడిందని, సమస్యను సత్వరమే పరిష్కరించాల్సి ఉందన్నారు. అసాధారణ పరిస్థితులను నివృత్తి చేసే విధంగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అనేక మార్గదర్శకాలను రాష్ట్ర మండళ్లకు సూచించిందన్నారు. ఆ మార్గదర్శకాలను తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, అక్కడి వైద్య విద్యార్థులకు వైద్య మండలి నమోదు ప్రక్రియలను పూర్తి విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా ఒక సంవత్సరంగా ఉన్న ఇంటర్న్‌షిప్ ఏపీలో మాత్రం రెండు మూడు సంవత్సరాలు విధించడం వల్ల వైద్య విద్యార్థులు విద్యా సంవత్సరాలను నష్టపోయే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈనెల 1న నేషనల్ మెడికల్ కమిషన్‌కు బీహార్ వైద్య మండలి రాసిన లేఖలో ఇంటర్న్‌షిప్ దానికి సంబంధిత విషయాలు రాష్ట్ర మండళ్ల పరిధిలోనివని, చేసిన సూచనను పరిగణలోకి తీసుకుని వెంటనే ఈ వివాదానికి తెరదించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరారు. వైద్య విద్యార్థులకు నష్టం జరగకముందే వైద్య విద్య సంచాలకులు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి తగు దిశ, నిర్దేశం చేయాలని ఐఎంఏ తరుపున అభ్యర్థిస్తున్నట్లు డాక్టర్ నందకిషోర్ కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధం


గుంటూరు మెడికల్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ చట్టాన్ని సమర్థంగా అమలు చేయడం వలన ఆడపిల్లల నిష్పత్తిని పెంచవచ్చన్నారు. సమాజంలో ఆడపిల్లలు పురుషులతో సమాన సంఖ్యలో ఉండాలని, అవకాశాలు కల్పిస్తే ఆడపిల్లలు ఏ స్థాయికైనా ఎదగగలరని పేర్కొన్నారు. ఆడపిల్లలపై వివక్షత విడనాడితే పురుషులతో సమానంగా రాణిస్తారన్నారు. ఆహారం, చదువు, స్వేచ్ఛ, అవకాశాలు కల్పించే విషయంలో సమానత్వం పాటించాలని సూచించారు. స్కానింగ్ చేసే అధికారం కేవలం రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులకు మాత్రమే ఉంటుందని, ఆర్‌ఎంపీలకు స్కానింగ్‌కు రిఫర్ చేసే అధికారం లేదన్నారు. ఆ విధంగా చేస్తే చట్ట ఉల్లంఘన కిందికే వస్తుందని హెచ్చరించారు.

26వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె

లక్ష్మీపురం: వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్‌ఎంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మె శుక్రవారంతో 26వ రోజుకు చేరింది. గత రెండు సంవత్సరాల నుండి తమ సమస్యలు పరిష్కరించకపోవడంతో నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని గుంటూరు జిల్లా అధ్యక్షురాలు టీ. ప్రవళిక, చీఫ్ అడ్వైజర్ కొడాలి సృజన తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తున్న సీహెచ్‌ఓ న్యాయపరమైన కోరికలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మానసిక రోగులు పెరుగుతున్నారు...

- యువతలోనూ పెరుగుతున్న వ్యాధి
- తీవ్ర ఒత్తిడితో వ్యాధి బారిన పడుతున్న వైనం
- ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నియంత్రవచ్చు
- ముందస్తు జాగ్రత్తలతో కట్టడి చేయవచ్చు
- నేడు వరల్డ్ స్కిజోఫ్రినియాడే



'శాంతాబాయిది పల్నాడు జిల్లా గురజాల. తల్లిదండ్రులే చంపేందుకు ప్రయత్నిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. యుక్తవయస్సులో ఉన్న కుమార్తె, అలాంటి ఫిర్యాదు చేయటంతో ఆందోళన చెందారు. దెయ్యం పట్టినట్లుగా భావించారు. భూత వైద్యులను సంప్రదించారు. అంత్రాలు కట్టించారు. తాయత్తులు మెడలో వేయించారు. అయినా ఆమె మానసిక స్థితిలో మార్పు రాలేదు. సుమారు రెండేళ్ల పాటు గడిపారు.' చివరికి జీజీహెచ్‌లోని మానసిక రోగుల వైద్య విభాగంలో చికిత్స చేయించారు.

గుంటూరు మెడికల్: మానసిక వ్యాధి కేసులు సర్వసాధారణంగా నమోదు అవుతున్నాయి. మానసిక వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి ప్రాథమిక దశలోనే వైద్యం చేయిస్తే అతి తక్కువ కాలంలోనే వారు సాధారణ స్థితికి చేరుకుంటారు. లేదంటే దీర్ఘకాలం వ్యాధితో బాధపడుతూ అది చూసి కుటుంబ సభ్యులు కూడా కుంగిపోవాల్సి వస్తుందని మానసిక వ్యాధుల వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధిపై అందరికి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది మే 24వ తేదీని 'ప్రపంచ స్కిజోఫ్రినియా డే' నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..

మెదడులో డోపమిన్, సెరటోనిన్ రసాయనాలు ఎక్కువగా ఉత్పత్తి అవ్వటం వల్ల స్కిజోఫ్రినియా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి మానసిక వ్యాధి. ఇది 15 నుంచి 25 ఏళ్ల వయస్సువారిలో ఎక్కువగా బయటపడుతుంది. యుక్తవయస్సులో వారి మానసిక స్థితి, ప్రవర్తను తల్లిదండ్రులు గమనించాలి. సాధారణంగా వయస్సు 50 ఏళ్లు దాటిన వారిలో అరుదుగా వస్తోంది. జెనిటిక్ సమస్యల వలన, దీర్ఘకాలంగా మానసిక ఒత్తిడికి గురవ్వటం, తలకు గాయాలు, అధిక ఒత్తిడి కారణంగా వ్యాధి సోకుతుంది. తల్లిదండ్రులకు మద్యం, పొగతాగటం, గంజాయి, మత్తు పదార్థాలు తీసుకోవటం లాంటి వ్యసనాలు ఉంటే వారికి పుట్టే పిల్లలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే వంశపారం పర్యంగా వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

వ్యాధి లక్షణాలు...

వ్యాధి సోకిన వారు తనలో తాను నవ్వుకోటం. కోపంగా అరవటం. తిట్టటం. కొట్టడం. మాటలో మార్పు. ప్రవర్తనలో తేడా. ఎవరో కనబడుతున్నట్లు అనుమానం వ్యక్తంచేయటం. చెవిలో మాటలు వినిపిస్తున్నట్లు చెప్పటం. బంధువులు, కుటుంబ సభ్యులో చంపాలని చూస్తున్నారని భ్రమపడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రతిరోజూ చేసే పనులు చేయకుండా మానివేయటం. పిలిచినా పలకకుండా ఏదో ఆలోచనలో పరధ్యానంగా ఉండటం. నిద్రపోకుండా, అన్నం తినకుండా, స్నానం చేయకుండా ఉండటం. ఒంటరిగా గడపటం చేస్తుండడం. ఇలాంటి వారిని స్కిజోఫ్రినియా వ్యాధి గ్రస్తులుగా గుర్తించి తక్షణమే మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.

వ్యాధిగ్రస్తులు అధికమే....



జీజీహెచ్‌లో మానసిక వ్యాధుల వైద్య విభాగానికి ప్రతిరోజూ వంద నుంచి 130 మంది చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 25 నుంచి 30 మంది స్కిజోఫ్రినియా బాధితులే. జిల్లా వ్యాప్తంగా 25 మంది మానసిక వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్ద ప్రతిరోజూ నలుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం ఉన్న జనాభాలో ఒకశాతం ఈ వ్యాధికి గురుతున్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రతిరోజూ 21 నంబర్ ఓపీ గదిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందిస్తున్నాం.

– డాక్టర్ నీలి ఉమాజ్యోతి, మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతి, జీజీహెచ్

ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి...



ప్రాథమిక దశలోనే స్కిజోఫ్రినియా బాధితులు మానసిక వైద్యులను సంప్రదిస్తే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చు. మానసిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు నాటు మందులు వాడటం, భూత వైద్యుల వద్దకు వెళ్లొద్దు. మానసిక వైద్యులను సంప్రదించాలి. ప్రతిరోజూ 8 గంటలపాటు నిద్ర, పౌష్టిక ఆహారం, ప్రతిరోజూ శారీరక వ్యాయామంతో పాటుగా మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మందులతో పాటుగా కొన్ని రకాల థెరపీలు ఉపయోగించి వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు.

–డాక్టర్ వద్దాది వెంకటకిరణ్
మానసిక వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పర్యావరణంపై అవగాహన ర్యాలీ

హాజరైన డీఆర్‌ఎం సుథేష్ణ సేన్



ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌ఎం సుథేష్ణ సేన్

లక్ష్మీపురం: ఈనెల 22వ తేది నుంచి జూన్ 6వ తేది వరకు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని డివిజనల్ మేనేజర్ సుథేష్ణ సేన్ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డిఆర్‌ఎం కార్యాలయలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా రెండోవ రోజు ప్రతిజ్ఞ, ర్యాలీ, ప్రచారం, సెల్ఫీల కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డిఆర్‌ఎం కార్యాలం నంచి ర్యాలీని ప్రారంభించి గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రచారం నిర్వహించి సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.సైమన్, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ వి.అనూష, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీసీఎం డాక్టర్ సిహెచ్.ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలపై దృష్టి సారించాలి

సామాజికవేత్త రాజసుందరబాబు



సంఘీభావం తెలియజేస్తున్న వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలపై దృష్టి సారించాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి లాడ్జిసెంటర్‌లోని ఎల్‌ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ ప్రార్థన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మతోన్మాదులు చర్చిలోకి వెళ్లి అలజడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. పట్టణాలలో క్రైస్తవ మిషనరీల కాలంలో ఏర్పడిన సమాధులన్నీ మృత దేహాలతో నిండిపోయాయని, క్రైస్తవులు మృదేహాలను ఖననం చేసేందుకు కోసం అంగుళం భూమి కూడా లేదని, క్రైస్తవులకు రక్షణకు ప్రత్యేక చట్టం పాస్టర్ ప్రవీణ్ పేరుతో చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఆరుమళ్ల మార్కు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతి బాబు, జాతీయ దళిత క్రిస్టియన్ వాచ్ రాష్ట్ర అధ్యక్షురాలు గద్దె రత్నశ్రీ పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అవుట్ ఫాల్ డ్రెయిన్లలో పూడిక తీత పనులు వేగవంతం చేయాలని, మైనర్ డ్రెయిన్లు, అవుట్ ఫాల్ డ్రెయిన్లు కలిసే ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు రాకుండా మెష్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ శాంతి నగర్, రత్నపురి కాలనీ, ముత్యాలరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత శాంతి నగర్‌లో అవుట్ ఫాల్ డ్రెయిన్ పొంగి మురుగు ఇళ్లల్లోకి వస్తుందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, వెంటనే పూడిక తీత పనులు చేపట్టాలని, అంతర్గత డ్రెయిన్ల నుంచి వ్యర్థాలు నేరుగా అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో కలవకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య విభాగ కార్మికులు తమకు కేటాయించిన ఇళ్ల నుంచి నూరు శాతం చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రజలు రోడ్ల మీద, కాలువల్లో వ్యర్థాలు వేయడం తగ్గుతుందని పేర్కొన్నారు. కార్మికులు, కార్యదర్శులు ప్రతి రోజు చెత్త సేకరణకు వెళ్లే సమయంపై ప్రజలకు అవగాహన కలిగించాలని చెప్పారు. నోడల్ అధికారులు ప్రతి రోజు తమకు కేటాయించిన ప్రాంతాల్లో కార్మికుల హాజరు, క్షేత్ర స్థాయిలో పనితీరు, ప్రజల అభిప్రాయాలను పరిశీలించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులపై నివేదిక ఇవ్వాలన్నారు. వార్డుల వారీగా బ్లాక్ స్పాట్స్ లేకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా గ్రీన్ మ్యాట్ లు, చెత్త వేయకూడదని బ్యానర్లను ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో గమనించి, వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. డ్రెయిన్ల మీద ర్యాంపులు ఏర్పాటు చేసి, శుభ్రం చేయడానికి వీలు లేకుండా ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, సర్వేయర్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల ఘనత



డాక్టర్ అందెకోటి వెంకటేశ్వరరావును అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: మంచినీరు, ఆహారం తీసుకోలేక అనారోగ్యానికి గురైన మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందెకోటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జీజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాచర్లకు చెందిన దుర్గ మూడు నెలల క్రితం పురుగు మందు తాగడం వలన అన్నవాహిక, జీర్ణాశయం పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ఆహారం తీసుకోలేక, కనీసం మంచినీరు తాగలేక రోగి ఇబ్బందులు పడుతుంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు రూ.6 లక్షల వరకు ఫీజు తీసుకుంటారని డాక్టర్ వెంకటేశ్వరరావు వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా పూర్తి ఉచితంగా ఆపరేషన్ చేశామన్నారు. ఆపరేషన్ చేసేందుకు సుమారు నాలుగు గంటల సమయం పట్టిందని, దుర్గ పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జి చేస్తున్నామన్నారు. అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి వ్యాధి బాధ నుంచి విముక్తి చేసిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందనలు తెలిపారు. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ శస్త్రచికిత్సలు జీజీహెచ్ పూర్తి ఉచితంగా చేస్తున్నారన్నారు. పేదలు జీజీహెచ్‌లో లభించే కార్పొరేట్ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పదేళ్ల బాధకు విముక్తి

మాచర్లకు చెందిన శాంతమ్మ ఎక్లాషియా కార్డియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఆమెకు హెల్లర్స్ కార్డియో మయోటమి, డోర్ ఫండో ఫ్లెకైషన్ అనే అరుదైన ఆపరేషన్ చేసి సమస్యను తొలగించామని వెల్లడించారు.

ధనేకుల వెంకటేశ్వరరావు చిరస్మరణీయులు



కవి ధనేకుల కవితా పఠనం చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం కవి ధనేకుల వెంకటేశ్వరరావు సంస్మరణ, రచయితల సభ నిర్వహించారు. తొలుత ధనేకుల చిత్రపటం వద్ద పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఆలయ పాలకమండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆలోకం పెద్దబ్బాయి సభాధ్యక్షత వహించారు. డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ నిర్వహణలో కవి ధనేకులతో రచయితలు వారి స్వానుభవాలను స్మరించుకుంటూ ఆయన రచనా పాటవాన్ని ప్రశంసించారు. అనంతరం కొణతం నాగేశ్వరరావు, బాబూరావు, పలనాటి సుబ్బారావు కవి ధనేకుల కవితా పఠనం చేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, బొల్లేపల్లి సత్యనారాయణ, లంక సూర్యనారాయణ, తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, నాయుడు గోపి, సుఖవాసి మల్లికార్జునరాయశాస్త్రి, నూతలపాటి తిరుపతయ్య, పెద్దిసాంబశివరావు, డాక్టర్ రావెల సాంబశివరావు, డాక్టర్ బీరం సుందరరావు, జక్కంపూడి సీతారామారావు, డాక్టర్ నరాలశెట్టి రవికుమార్. జీ. వైదేహి, డాక్టర్. భూసురపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ సతీష్, డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ పాపినేని శివశంకర్, డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ మాట్లాడారు. కార్యక్రమంలో కారుమంచి లీలాశంకర్, డాక్టర్ నరాలశెట్టి రవికుమార్, పి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

అనారోగ్య ప్రపంచానికి ఏకైక విరుగుడు 'యోగా'

లక్ష్మీపురం: సకల ఆరోగ్య ప్రదాయినిగా అవతరించి విశ్వ జనావళి చేత ఆమోదింపబడిన ఆధ్యాత్మిక, ఆరోగ్య వ్యాయామ ప్రక్రియ యోగాను అనుసరించడమే నేటి అస్తవ్యస్త అనారోగ్య ప్రపంచానికి ఏకైక విరుగుడని అవగాహన సంస్థ ఆరోగ్య సభలో ప్రముఖ యోగాచార్యులు ప్రొఫెసర్ గుంటుపల్లి సాంబశివరావు అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'యోగాతో ఆరోగ్యం- ఆనందం' అన్న అంశంపై సభ జరిగింది. ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం అందరూ ఘనంగా జరుపుకునేలా ఈ నెల యోగాపై ప్రచారం నిర్వహించ దానికి అందరూ సిద్ధ పడాలన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు ఎస్.సదాశివం, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ సమన్వయకర్త హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్‌తో పాటు, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు స్పొకెన్ ఇంగ్లీష్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌పై బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగావకాశాన్ని కల్పిస్తామని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

కులగణన ప్రక్రియను వేగవంతం చేయాలి

మంగళగిరి టౌన్: కుల గణన ప్రక్రియను కేంద్రం వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర మంత్రి మండలి కుల గణనకు ఆమోదం తెలుపుతూ విధాన నిర్ణయం తీసుకుని కూడా విధి విధానాలను రూపొందించకుండా జాప్యం చేయడం తగదని అన్నారు. ఆయా కులాల జనాభా దామాషా మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజలందరి సంక్షేమం, అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్న ఆశాభావాన్ని ఆ ప్రకటనలో వ్యక్తం చేశారు.

ఎంజే మాణిక్యరావు సేవలు మరువలేనివి



ఎంజే మాణిక్యరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన ఎంజే మాణిక్యరావు చిరస్మరణీయుడని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. అధ్యాపక ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్సీ ఎంజే మాణిక్యరావు శత జయంతి సందర్భంగా శుక్రవారం ఏసీ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి కేఎస్ లక్ష్మణరావుతో పాటు మాణిక్యరావు తనయుడు ఎం.విజయకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యాసంస్థలు రాష్ట్ర విద్యారంగాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయని, ఆయా విద్యాసంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకుల సంక్షేమం కోసం మాణిక్యరావు నిరంతరం శ్రమించారని తెలిపారు. గతంలో జీఓ 35 ద్వారా పోస్టులు భర్తీ కాక, ఎయిడెడ్ విద్యాసంస్థలు క్షీణించాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించిన ఎయిడెడ్ విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయడం ద్వారా ఎయిడెడ్ విద్యాసంస్థల పురోగతికి సహకరించాలని కోరారు. మాణిక్యరావు స్ఫూర్తితో ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మాణిక్యరావు వంటి పోరాట యోధుల స్ఫూర్తితో సాధించుకున్న హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్‌రావు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మోజెస్ పాల్గొన్నారు.

వెళ్లేందుకు దారేది..



లాలాపేట శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఎదుట ఆట వస్తువుల తోపుడు బండి

నగరంపాలెం: ఇష్టానుసారంగా వాహనాల నిలుపుదలతో భక్తులు, వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. లాలాపేట శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి పాల ఆస్పత్రి, రైతు బజార్, లాలాపేట పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల వైపు వెళ్లే రహదారిలో నిత్యం రద్దీగా ఉంటుంది. గుంటూరు నగర, శివారు ప్రాంతాలతోపాటు జిల్లాలోని పలు మండల, గ్రామాల ప్రజలు వస్తువులు, దుస్తులు కొనుగోలు చేసేందుకు రాకపోకలు చేస్తుంటారు. రద్దీగా ఉండే రహదారిలో అడ్డగోలుగా వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. చెప్పులు, దుస్తులు, ఆట వస్తువులు, గృహోపకరణాల వస్తువుల తోపుడు బండ్లతో రహదారి అక్రమణకు గురవుతుంది. దీంతో కొద్దిపాటి దారిలో వెళ్లేందుకు నానా ఆగచాట్లకు గురవుతున్నారు. ఆఖరికి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే, పోయే భక్తులు అవస్థలు పడుతున్నారు. అయితే టీడీపీ నేత ఒకరూ బండ్లు వద్ద మాముళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ట్రాఫిక్ పోలీసులు ఇటు వైపు కన్నెత్తి చూడటంలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదని పలువురు ప్రజలు వాపోతున్నారు.

ఆలయం వద్ద అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న తులసి ధర్మచరణ్

కొరిటెపాడు: అన్నదాన కార్యక్రమాన్ని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక కొత్తపేట అభయ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి మహోత్సవంలో భాగంగా శుక్రవారం పోతురాజు రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ధర్మచరణ్, ఆలయ కమిటీ సభ్యులతో కలసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల నుంచి ఆశీర్వాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ ప్రజలు పనులతో ఎంతో ఒత్తిడికి లోనవుతున్నారని, దైవ కార్యక్రమాల్లో పాల్గొనడం వలన ఎంతో ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పోతురాజు శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, డాక్టర్ ఎస్.ఉమా శంకర్, టి.రంగారావు, జె.సాయిరాం, జి.బాలసుబ్రహ్మణ్యం, టి.వెంకట్రావు, ఎ.మురళి పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు



అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: హనుమాన్ జయంతి పురస్కరించుకుని నెహ్రూనగర్ 5వలైనులోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా శుక్రవారం ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కోటా సీతరామదాసు, యర్రబాబు, శంషేర్, ఎ.శ్రీధర్, హనుమంతరావు, శ్రీధర్, రమేష్, నందేటి రాజేష్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ..

వైఎస్సార్ సీపీ 44వ డివిజన్‌కు చెందిన పార్టీ క్రియాశీలక కార్యకర్త సుబ్బారావు గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో అరవింద్, సత్య, వసంత్, గంగ, సుబ్బు, అనిల్, సుధీర్, వేణు ఉన్నారు. అనంతరం 1వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకుడు షరీఫ్ అనారోగ్యంతో ఉన్నారని తెలిసి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, పార్టీ నేతలు చింతా రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

తాడేపల్లి రూరల్: ఓ వ్యక్తి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. పద్మశాలీ బజారులో ఎస్.కె. మాబూ సుభాని(50) వివాహం చేసుకోకుండా ఒంటరిగా సొంత ఇంట్లో నివాసముంటున్నాడు. పక్కనే ఉన్న తన అక్క దగ్గర భోజనం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో అక్క చనిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మూడు రోజులుగా సుభాని కనిపించకపోవడం, ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు ఇంట్లో చూశారు. అప్పటికే సుభాని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.